సాక్షి
నంద్యాల
గురువారం । 27 । ఏప్రిల్ । 2023



అన్నప్రసాద పథకానికి విరాళం
శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జునస్వామి వార్ల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బుధవారం చెన్నైకి చెందిన జి. రామారావు రూ.లక్ష విరాళమిచ్చారు.



సాక్షిగణపతికి విశేష పూజలు
శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణం లోని జ్వాలావీరభద్రస్వామికి పూజలు చేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన
శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ధర్మపథం లో భాగంగా బుధవారం కడపకు చెందిన సాయినటరాజ డ్యాన్స్ అకాడమీ కళాకారులు భక్తి గీతాలకు నృత్యం చేశారు.

న్యూస్‌రీల్

1 నుంచి పాఠశాలలకు వేసని సెలవులు
నంద్యాల(సిటీ): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలలకు మే 1వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ఇస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 12వ తేదీన తిరిగి పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు. వేసవి సెలవుల్లో పాఠశాలలు నిర్వహించకూడదని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

మహానంది ఈఓగా చంద్రశేఖర్‌రెడ్డి కొనసాగింపు



మహానంది: మహానంది దేవస్థానం ఈఓగా చంద్రశేఖర్‌రెడ్డిని కొనసాగిస్తూ ఏపీ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. వయోజన విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉంటూ ఫారిన్ సర్వీస్‌పై మహానంది దేవస్థానం ఈఓగా విధులు నిర్వహిస్తున్న ఈయనకు ఇటీవలే డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి లభించిన విషయం తెలిసిందే.

నేరాల కట్టడికి కఠిన చర్యలు
బొమ్మలసత్రం: జిల్లాలో నేరాల కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక రాజారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నేరాలపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిర్ణీత గడువులోగా పెండింగ్ కేసులను పరిష్కరించాలని సూచించారు. అధునాతన పరికరాలు ద్వారా హత్యలు, గర్ల్‌మిస్సింగ్ కేసులను ఛేదించాలన్నారు. రాత్రి సమయాల్లో గస్తీ ముమ్మరం చేయాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తరచూ వాహనాల తనిఖీలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. లోన్‌యాప్ మోసాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిలో మార్పు రాకపోతే జిల్లా బహిష్కరణ చేయాలన్నారు. ఏఎస్పీ రమణ, డీఎస్పీలు మహేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శృతి పాల్గొన్నారు.

ఫలితాలు మెరుగు

- గత ఏడాది కంటే మెరుగైన ఉత్తీర్ణత
- ఫస్టియర్‌లో 56, సెకండియర్‌లో 66 శాతం మంది పాస్
- ఫలితాల్లో బనవాసి రెసిడెన్షియల్ విద్యార్థుల ప్రతిభ
- వచ్చే నెల 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు



కర్నూలు (సిటీ): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం గత ఏడాది కంటే పెరిగింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా రాష్ట్రస్థాయిలో గత ఏడాది 9వ స్థానంలో ఉండగా ఈ ఏడాది కాస్త మెరుగుపడి 8వ స్థానానికి చేరింది. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో గత ఏడాది ఉన్న 10వ స్థానంతో సరిపెట్టుకుంది. బుధవారం సాయంత్రం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జనరల్ విభాగంలో మొదటి సంవత్సరం విద్యార్థులు 29,772 మంది పరీక్షలకు హాజరుకాగా 16,635 మంది (56 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2,532 విద్యార్థులకు గాను 976 మంది (39 శాతం) పాస్ అయ్యారు. జనరల్ విభాగంలో సెకండియర్ విద్యార్థులు 26,980 మందికి గాను 17,719 మంది (66 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2,221 మందికి గాను 1,109 మంది (50 శాతం) పాస్ అయ్యారు. గత ఏడాది మొదటి సంవత్సరం 50 శాతం ఫలితాలు రాగా ఈ ఏడాది ఆరు శాతం, అలాగే గత ఏడాది ద్వితీయ సంవత్సరం 55 శాతం ఫలితాలు రాగా ఈ ఏడాది 11 శాతం ఉత్తీర్ణత పెరిగింది. ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో మొదటి సంవత్సరంలో 5 ప్రైవేటు కాలేజీలు, ద్వితీయ సంవత్సరంలో 3 ప్రైవేటు కాలేజీలు జీరో శాతం ఉత్తీర్ణతను సాధించాయి. ఏడు కస్తూర్బా జూనియర్ కాలేజీల్లో ఫస్టియర్ విద్యార్థులు ఒక్కరు కూడా ఉత్తీర్ణులు కాలేదు.

ఏపీ మోడల్ స్కూల్స్...
ఉమ్మడి జిల్లాలో 35 ఏపీ మోడల్ స్కూల్స్ ఉన్నాయి. మొదటి సంవత్సర ఫలితాల్లో 2,457 మందికి గాను 907 మంది (36.98 శాతం), ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 2,330 మందికి గాను 1,085 మంది (46.57 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణలయ్యారు. మొదటి సంవత్సరంలో పాములపాడు మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యధిక (77.78) శాతం, మద్దికెర మోడల్ స్కూల్ అతి తక్కువ (5.33) శాతం, ద్వితీయ సంవత్సరంలో గోస్పాడు మోడల్ స్కూల్‌కి చెందినవారు అత్యధిక (93.59) శాతం, మద్దికెర అతి తక్కువ (7.2) శాతం ఉత్తీర్ణులయ్యారు.

కేజీబీవీలు..
ఉమ్మడి జిల్లాలో 47 కేజీబీవీ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. మొదటి సంవత్సరంలో 977 మంది విద్యార్థులకు గాను 358 మంది (36.6 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో (కేవలం 17 కాలేజీల్లో మాత్రమే) 485 మందికి 280 మంది (57.73 శాతం) ఉత్తీర్ణత సాధించారు. గోస్పాడు కేజీబీవీ అత్యధిక శాతం (88.46), అతి తక్కువ ఎమ్మిగనూరు, సంజామల కేజీబీవీలలో 4.76 శాతం ఉత్తీర్ణులయ్యారు. హాలహర్వి(ఒకేషనల్), చిప్పగిరి (ఒకేషనల్), అమ్మిరెడ్డి నగర్ (వి), కొలిమిగుండ్ల (ఒకేషనల్), కౌతాళం (ఒకేషనల్), కోటకందుకూరు (ఆళ్లగడ్డ), ఓర్వకల్లు (ఒకేషనల్) కేజీబీవీల్లో జీరో శాతం ఉత్తీర్ణత నమోదైంది.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలు..
ఉమ్మడి జిల్లాలో 42 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ఈ కాలేజీలకు చెందిన విద్యార్థులు మొదటి సంవత్సరంలో 4,372 మందికి గాను 1,243 (28.43 శాతం), ద్వితీయ సంవత్సరంలో 4,787 మందికి గాను 1,941 (40.55 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో అత్యధికంగా కొలిమిగుండ్ల జూనియర్ కాలేజ్ 58.62 శాతం, అతి తక్కువ చిప్పగిరి 3.0 శాతం, ద్వితీయ సంవత్సరంలో గోస్పాడు అత్యధికంగా 74.24 శాతం, అతి తక్కువ పాములపాడు 4.76 శాతం ఉత్తీర్ణులయ్యారు. అదే విధంగా ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ (బనవాసి) అన్ని యాజమాన్యాలలో కంటే అత్యధిక మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 98 మంది పరీక్షలకు హాజరైతే 95 మంది పాసయ్యారు.

రీకౌంటింగ్‌కు అవకాశం
గత నెల 15 నుంచి ఈనెల 4వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించారు. బుధవారం ఫలితాలను విడుదల చేశారు. మార్కులు తక్కువ వచ్చిన వారు, వచ్చిన మార్కులపై అనుమానమున్న వారు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు అవకాశం కల్పించారు. ఇందుకు వచ్చే నెల 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. సప్లిమెంటరీ పరీక్షలకు వచ్చే నెల 3వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి. ఈ పరీక్షలు వచ్చే నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షల్లో ఫెయిల్ అయినవారికి జూన్ 6 నుంచి 9వ తేదీ వరకు పరీక్షలు జరపనున్నారు.

సత్తాచాటిన బాలికలు
ఇంటర్ ఫలితాల్లో బాలికలు సత్తాచాటారు. మొదటి సంవత్సరం పరీక్షలకు బాలురు 22,239 మంది హాజరు కాగా 11,204 మంది(50 శాతం), బాలికలు 15,292 మంది హాజరుకాగా 9,464 మంది(62శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో బాలురు 13,045 మంది పరీక్షలకు హాజరుకాగా 7,644 (59 శాతం) మంది, బాలికలు 13,935 మంది హాజరుకాగా 10,075 (72శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.





బనవాసి..ఫలితాల్లో మెరిసి
ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీ విద్యార్థినులు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో తమ సత్తా చాటారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసగుప్త తెలిపారు. మొత్తం 98 మంది పరీక్షకు హాజరు కాగా 91 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఎంపీసీలో పి. ప్రీతి (463/470), జి. రిషిత (463/470), అమృత(463/470) అత్యధిక మార్కులు సాధించారని, బైపీసీలో కృష్ణప్రియ (427/440), అలాగే ఎంఈసీలో రుపశ్రీ(476/500) అత్యధిక మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మొత్తం 133 మంది పరీక్షకు హాజరుకాగా 131 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. బైపీసీలో భార్గవి (966/1000) ఎఈసీలో కుమ్మర అనిత (944/1000) అధిక మార్కులు సాధించినట్లు చెప్పారు.



సుష్మ, ఎంపీసీ (984/1000)

అత్యధిక మార్కులు సాధించిన వారు

మొదటి సంవత్సరం బైపీసీ (440 మార్కులకు)
జి.ఉమ్మే హని 434, వాసవి 433, పి.శ్వేతారెడ్డి 432, ఎం.అఫీఫా తయ్యబ 432, ఎం.షేక్ సానియా అజ్రా 432, ఎం.కీర్తి 432, బోయ మేఘన 431, బి.మాధురి 431, సన సమ్రీన్ 431

మొదటి సంవత్సరం ఎంపీసీ (470 మార్కులకు)
పి.ద్రాక్షాయని 466, ఆదోని సింధు 465, ఎ.కావ్యశ్రీ 465, కె.సుబ్బ మేఘన 465, చరిత 464, సుబ్బరాయుడు 464, పి.ప్రణతిరెడ్డి 464, ఆర్.మేఘన 462, వై.వినీత్‌కుమార్ 462, ఎస్.భద్రినాథ్‌రెడ్డి 462

ఒకేషనల్ విభాగంలో ఆఫీస్ అసిస్టెంటెన్సీలో షేక్‌మాబీ 468 మార్కులు సాధించారు.

ద్వితీయ సంవత్సరం ఎంపీసీ (1000 మార్కులకు)
జి.జాహ్నవి 989, కుందం సాహితి 989, విజయ తేజశ్విని 988, రానా సాధిక్ 988, లిఖిత 987, శృతి కీర్తి 987, ఆర్.కార్తీక్ పవన్ 987, ఆర్.ఉదయ్‌కుమార్ రెడ్డి 985, బోయ సుష్మ 984

ద్వితీయ సంవత్సరం బైపీసీ (1000 మార్కులకు)
ఎం.మానస 989, ఆర్.జ్యోష్నిక 988, తులసి 988, షేక్ సీరజ్ 988



బనగానపల్లె మండలం చిన్నరాజుపాలెం తండాలో రాలిన మామిడి కాయలు



కొత్తపల్లి మండలం సింగరాజుపల్లె గ్రామంలో పిడుగుపాటుకు గురైన చెట్టు

దంచికొట్టిన వాన

- ఒక్క రోజు 47.2 మి.మీ. వర్షపాతం
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- మూడు చోట్ల పిడుగుపాటు ఘటనలు
- వరి, మొక్కజొన్న పంటలకు నష్టం

కర్నూలు(అగ్రికల్చర్): భానుడి భగభగల నుంచి కాస్త ఉపశమనం లభించింది..మండు వేసవిలో ఉన్నట్టుండి ఉరుములు, మెరుపులతో వరుణుడు విరుచుకపడ్డాడు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బుధవారం తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 8 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఎమ్మిగనూరు, కల్లూరు, కర్నూలు, గోనెగండ్ల, బనగానపల్లె, బేతంచెర్ల, పాణ్యం, పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గూడూరు మండలం పెంచికలపాడు వద్ద వక్కెర వాగు ఉధృతంగా ప్రవహించింది. కల్లూరు మండలంలోని నెరవాడ వంకతో పాటు పలు వాగులకు భారీగా నీరు చేరింది. ఎమ్మిగనూరులో అతి భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సోగనూరు రోడ్డులో నీరు పెద్ద ఎత్తున నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. డ్రైయినేజీ పొంగడంతో రెండు బైకులు కొట్టుకుపోయాయి. బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణం చెరువును తలపించింది. కోడుమూరు మండలం అమడగుంట్లలో గాలి, వాన తీవ్రతకు హైస్కూల్‌లోని రేకుల షెడ్లు ధ్వంసం అయ్యాయి. పై తట్టు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడటంతో కర్నూలు హంద్రీనదికి భారీగా వరదనీరు వచ్చింది. కర్నూలు జిల్లాలో 14 మండలాల్లో వర్షం కురవగా.. అత్యధికంగా ఎమ్మిగనూరులో 108.2 మి.మీ., అత్యల్పంగా ఆదోని మండలంలో 1.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. నంద్యాల జిల్లాలో 21 మండలాల్లో వర్షం కురవగా.. అత్యధికంగా బనగానపల్లెలో 88 మి.మీ., అత్యల్పంగా డోన్‌లో 0.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. కర్నూలు జిల్లాలో సగటున 27 మి.మీ, నంద్యాల జిల్లాలో 20.2 మి.మీ. ప్రకారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక్క రోజునే సగటున 47.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. భారీ వర్షం పడటం, వాగులు, వంకలు పొంగడంతో వేసవిలో నీటి సమస్య నుంచి ప్రజలు పూర్తిగా గట్టెక్కే అవకాశం లభించింది.

పిడుగు పాటుతో 13 జీవాలు మృతి
ఎండాకాలం కావడంతో ఆస్పరి మండలం బైలుపత్తికొండ గ్రామంలో జీవాలను ఆరుబయటనే ఉంచారు. ఉన్నట్టుండి భారీ ఉరుములు, మెరుపులతో వర్షం పడడంతో వాటిని సురక్షిత ప్రాంతంలోకి తరలించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో పిడుగు పడింది. దీంతో సుంకన్నకు చెందిన 4, ఓబులపతికి చెందిన 8, పురుషోత్తమ్‌కు చెందిన ఒకటి..మొత్తం 13 జీవాలు మృతి చెందాయి. పెద్దకడబూరు మండలం హెచ్.మురవణి గ్రామంలో పిడుగు పాటుకు రెండు ఆవులు మృతి చెందాయి. కొత్తపల్లి మండలం సింగరాజుపల్లి గ్రామంలో పిడుగు పడటంతో చెట్టు కాలిపోయింది.



కొలిమిగుండ్లలో వర్షం కురుస్తున్న దృశ్యం



పగిడ్యాల మండలంలో నీట తడిసిన వరి ఓజలు

పంటలకు అకాల నష్టం
భారీ వర్షంతో మామిడి పంటకు నష్టం జరిగింది. కాయలు భారీగా నేల రాలడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదోని, ఎమ్మిగనూరు, కల్లూరు, గోనెగండ్ల నందవరం తదితర మండలాల్లో మిర్చి పంటను కల్లందొడ్లు, పొలాల్లో ఆరబెట్టారు. భారీ వర్షాలకు మిర్చి కొన్ని చోట్ల తడిచి పోగా.. మరికొన్ని చోట్ల నీళ్లలో కలసి పోయింది. బండి ఆత్మకూరు, అవుకు, వెలుగోడు, జూపాడుబంగ్లాలోని 16 ఆర్‌బీకేల పరిధిలో 2,642 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. అవుకు మండలంలో 55 హెక్టార్లలో మొక్కజొన్న, బండిఆత్మకూరు మండలంలో 2,234, అవుకు మండలంలో 225, వెలుగోడు మండలంలో 118, జూపాడు బంగ్లా మండలంలో 10 హెక్టార్ల ప్రకారం వరి పంట దెబ్బతినింది. పాణ్యం, పగిడ్యాల, జూపాడుబంగ్లా. కొత్తపల్లి మండలాల్లో వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది.

వర్షపాతం వివరాలు మండలాల వారీగా..

మండలం	కురిసిన వర్షం(మి.మీ)
కర్నూలు జిల్లా	
ఎమ్మిగనూరు	108.2
కల్లూరు	70.4.
గోనెగండ్ల	65.0
కర్నూలు అర్బన్	54.6
కర్నూలు రూరల్	53.2
గూడూరు	48.2
నందవరం	47.2
వెల్దుర్తి	44.2
ఓర్వకల్లు	39.8
కృష్ణగిరి	36.6
సి.బెళగల్	34.8
పెద్దకడబూరు	33.4
నంద్యాల జిల్లా	
బనగానపల్లె	88.0
బేతంచెర్ల	75.2
పాణ్యం	62.4
పగిడ్యాల	60.8
జూపాడుబంగ్లా	56.8
నందికొట్కూరు	33.8
కొత్తపల్లి	33.0
గడివేముల	30.2

ఉన్నత విద్యకు ప్రభుత్వ ప్రోత్సాహం

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్
- జగనన్న వసతి దీవెన కింద జిల్లాకు రూ. 33.83 కోట్లు
- బటన్‌నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసిన సీఎం వైఎస్ జగన్



వసతి దీవెన మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల: పేదల పిల్లలు ఉన్నత విద్య అభ్యసించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తోందని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా నార్పల నుంచి 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించిన జగనన్న వసతి దీవెన కార్యక్రమాన్ని ప్రారంభించారు. బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలానీ శామూన్, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, సంక్షేమ శాఖ డీడీ చింతామణి, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీదేవి, విద్యార్థులు, వారి తల్లులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న వసతి దీవెన కింద జిల్లాలో 35,447 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 33.83 కోట్లు జమ అయ్యాయన్నారు. ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులు భోజన, వసతి ఖర్చుల కోసం ఇబ్బంది పడకూడదని ఏటా రెండు వాయిదాల్లో ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం సాయం అందజేస్తోందన్నారు. ప్రభుత్వ సహాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ పేద విద్యార్థులు సైతం పెద్ద చదువులు చదవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ అర్హులకు వసతి దీవెన సొమ్ముకు సంబంధించిన మెగా చెక్కు అందజేశారు.

నియోజకవర్గం	విద్యార్థుల సంఖ్య	జమ అయిన నగదు (రూ.కోట్లల్లో)
ఆళ్లగడ్డ	6,036	5.84
బనగానపల్లె	6,453	6.12
డోన్	5,152	4.85
నందికొట్కూరు	5,326	5.07
నంద్యాల	6,066	5.83
పాణ్యం	1800	1.70
శ్రీశైలం	4,614	4.40

పట్టణ అభివృద్ధిపై మంత్రి సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అమరావతిలోని తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. వంద పడకల ప్రభుత్వాసుపత్రి, మునిసిపల్ పరిపాలన భవనం, క్లబ్ హౌస్, జెడ్పీ, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ల నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. తాజాగా డోన్‌లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.6.40 కోట్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించినట్లు మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. త్వరలో నిర్వహించే మునిసిపల్ పరిపాలన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రిని ఆహ్వానించినట్లు చైర్మన్ తెలిపారు.

క్లుప్తంగా

మహానందిలో నేడు వైశాఖ శుద్ధసప్తమి వేడుకలు

మహానంది: మహానంది క్షేత్రంలోని రుద్రగుండం కోనేరులో గురువారం వైశాఖ శుద్ధసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వేదపండితులు రవి శంకర అవధాని తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం ఆరు గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. వైశాఖ శుద్ధసప్తమి రోజు గంగాదేవి స్వయంగా రుద్రగుండం కోనేరులో స్నానమాచరించి తను శుద్ధిని పొందటంతో పాటు భక్తుల పాపాలను పోగొడుతుందని పురాణాల్లో ఉందన్నారు. అంతటి పవిత్రమైన రోజున రుద్రగుండం పుష్కరిణిలో స్నానమాచరిస్తే 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కర స్నాన ఫలితం లభిస్తుందన్నారు.

కేడీసీసీ బ్యాంకులో 36 మందికి పదోన్నతి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో 36 మందికి పదోన్నతులు కల్పిస్తూ బ్యాంకు చైర్‌పర్సన్ మహాలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాయంత్రం తన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో పదోన్నతి ఉత్తర్వులను చైర్‌పర్సన్ మహాలక్ష్మి, సీఈఓ పి.రామాంజనేయులు అందజేశారు. 12 మందికి స్టాఫ్ అసిస్టెంటు నుంచి అసిస్టెంటు మేనేజర్లుగా, 12 మందికి అసిస్టెంటు మేనేజర్ నుంచి మేనేజర్లుగా, 12 మందికి మేనేజర్ నుంచి చీఫ్ మేనేజర్లుగా పదోన్నతులు లభించాయి. కార్యక్రమంలో పాలకవర్గం సభ్యుడు గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, ఏజీఎం త్రినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.200 కోట్లతో చెరువుల అభివృద్ధి

ఉయ్యాలవాడ: రాష్ట్రంలో రూ.200 కోట్లతో చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు ప్రపంచ బ్యాంకు అధికారులు తెలిపారు. బుధవారం మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, ఈఈ రఘురామిరెడ్డి, ఎస్‌పీడీ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు రాఘవయ్యతో కలిసి వారు మండలంలోని రూపనగుడి చెరువును పరిశీలించారు. ఈ చెరువు ఆధునీకీకరణకు 2019 సంవత్సరంలో రూ. 1.20 కోట్లు కేటాయించారు. అందుకు సంబంధించిన పనులు, నాణ్యతను పరిశీలించేందుకు వచ్చిన ప్రపంచ బ్యాంకు అధికారులు స్థానిక రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రపంచ బ్యాంకు అధికారుల బృందంలో సమంతరామ్, నోరాకోయిస్, వనిత కొమ్ము, వెంకట్‌రావు, సురేందర్‌శర్మ, సేనాపతి ఉండగా జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, పాల్గొన్నారు.

రాజగోపురాలకు పరంజా ఏర్పాటు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో మే 25వ తేదీ నుంచి మహాకుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయ రాజగోపురాలు, విమానగోపురాలకు పరంజా ఏర్పాటు పనులు చేపట్టారు. కుంభాభిషేకం సమయంలో గోపుర శిఖరాలకు అభిషేకం జరిపేందుకు వీలుగా వాటిని ఏర్పాటు చేస్తున్నారు. పనులు ప్రారంభోత్సవానికి ముందు సంప్రదాయబద్ధంగా గోపురం మండపానికి ఈఓ ఎస్‌లవన్నతో పాటు ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు తన్నీరు ధర్మరాజు, అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వి.రామకృష్ణ, డిప్యుటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు నరసింహారెడ్డి, సహాయ స్థపతి ఐ.ఉమావెంకట జవహర్, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

బొమ్మలసత్రం: బాధిత పోలీసు కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి అన్నారు. జిల్లాలో విధినిర్వాహణలో ఉంటూ మృతిచెందిన పోలీసులు అల్లాబకాష్, రామకృష్ణ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణ, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒంటి చేత్తో.. బతుకు బాధ్యతతో!

ఉద్యోగం రాలేదనో, కోరుకున్న జీవితం దక్కలేదనో ఇటీవల కాలంలో అర్ధాంతరంగా తనువు చాలిస్తున్న ఘటనలు చూస్తున్నాం. ఎదుటి వారితో పోల్చుకోకపోతే ఉన్నంతలో హాయిగా జీవించవచ్చని నాగరాజును చూస్తే అనిపిస్తుంది. కర్ణాటక జిల్లా రాయచూరు నుంచి కల్లూరుకు వలస వచ్చిన ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. ఎడమ చేయి పడిపోవడంతో భార్య కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. ఒక చేయి పని చేయడం లేదని, ఇక తన జీవితం ఇంతేనని నాగరాజు ఇంటికే పరిమితం కాలేదు. విధి రాతకు ఎదురొడ్డి నిలిచాడు. మరో చేయి ఉందనే సంతోషంతో భార్యకు చేదోడుగా నిలుస్తున్నాడు. తోపుడు బండిపై ఉల్లిగడ్డలు విక్రయిస్తున్నాడు. పిల్లలను ఇంటి వద్దే వదిలేస్తే అల్లరిగా తిరుగుతారని, తనతో పాటు ఉంటే కష్టం విలువ తెలుస్తుందని, బాధ్యతగా నడుచుకుంటారని అదే బండిపై కూర్చోబెట్టుకుని 'బతుకు బండి' లాగిస్తున్నాడు. జీవితాన్ని భారంగా భావించే వారికి ఇతను స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

– ఫొటో: డి.హుస్సేన్

ఫొటో ఆఫ్ ది డే..



వైభవంగా నరసింహ జయంత్యుత్సవాలు



హంసవాహనంపై ఊరేగుతున్న జ్వాలనరసింహుడు

ఆళ్లగడ్డ: అహోబిలం క్షేత్రంలో లక్ష్మీనరసింహ స్వామి జయంతి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి ఉదయం హంస వాహనం, రాత్రి సూర్య ప్రభ వాహనాలను అధిరోహించి తిరుమాడ వీధుల్లో విహరించారు. ముందుగా మూలమూర్తులు స్వామి, అమ్మవారిని సుప్రభాత సేవతో మేలుకొలిపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వాములను యాగశాలలో కొలువుంచి అర్చన, అభిషేకం, తిరుమంజనం నిర్వహించారు.

శరవేగంగా ఎయిర్‌పోర్టు సుందరీకరణ

- అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం
- ఓర్వకల్లు మండలంలో విస్తృత పర్యటన



సోలార్ పరిశ్రమ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయంలో చేపడుతున్న సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మండలంలో విస్తృతంగా పర్యటించారు. వారు వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎయిర్ పోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేస్తున్న విప్లవకారుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాల వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించారు. పూల మొక్కలతో ఏర్పాటు చేసే డిజైన్‌లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గుమ్మితం తండా సమీపంలో గ్రీన్‌కో సంస్థ ఏర్పాటు చేస్తున్న సోలార్, పవన విద్యుత్, జల విద్యుత్ ఉత్పాదక పరిశ్రమలతో కూడిన బహుళార్థ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఏడాదికి ఎన్ని మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. ఎంత ఖర్చు అవుతుందనే అంశాలపై సంస్థ ప్రతినిధులతో చర్చించారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండలకేంద్రం ఓర్వకల్లులో జగనన్న హౌసింగ్ కాలనీని ఆమె పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయం, కస్తూరిబా పాఠశాలను సందర్శించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డ్వామా గ్రీన్‌కో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏపీడీ ఏవీఎస్ నాయుడు, ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథరెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, వివిధ శాఖల డీఈలు, ఏఈలు, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథగౌడు, సింగిల్ విండో చైర్మన్లు నాగతిరుపాలు, చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాషా, వివిధ మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ సచివాలయాల్లో స్పందన

- జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ శామూన్



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నంద్యాల(సిటీ): ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. బుధవారం నంద్యాల పట్టణంలోని సాధిక్ నగర్ 29వ వార్డు సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పందన ఫిర్యాదులను రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే గడువు లోపు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, అడిషనల్ ఎంహెచ్ఓ డాక్టర్ అంకిరెడ్డి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

పోలీసు శాఖలో సబ్ డివిజన్ అధికారుల బదిలీలు

- ఆదోని సబ్ డివిజన్‌కు ఐపీఎస్ అధికారి
- ఆత్మకూరు డీఎస్పీగా శ్రీనివాసరావు
- ఆళ్లగడ్డకు వెంకటరామయ్య



ఆదిరాజ్ రాణా, ఏఎస్పీ, ఆదోని



ఎ.శ్రీనివాసులు, డీఎస్పీ, పత్తికొండ



ఎ.శ్రీనివాసరావు, డీఎస్పీ,ఆత్మకూరు



బి.వెంకటరామయ్య, డీఎస్పీ, ఆళ్లగడ్డ



కె.విజయశేఖర్, డీఎస్పీ, కర్నూలు



బి.సీతారామయ్య, డీఎస్పీ, ఎమ్మిగనూరు

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లా పోలీసు శాఖలో ఐదుగురు డీఎస్పీలు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా మొత్తం 70 మంది సబ్ డివిజన్ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఆదోనికి ఐపీఎస్ అధికారి ఆదిరాజ్ రాణా నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న కేఎస్ వినోద్‌కుమార్‌ను కడప జిల్లా పులివెందులకు బదిలీ చేసి, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏఎస్పీగా పనిచేస్తున్న ఆదిరాజ్ రాణాను ఆదోని సబ్ డివిజన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నంద్యాల, డోన్ డీఎస్పీలు మినహా మిగిలిన ఆరు పోలీస్ సబ్ డివిజన్‌లకు బదిలీల్లో భాగంగా కొత్త అధికారులు నియమితులయ్యారు.

➡ కర్నూలు డీఎస్పీగా చిత్తూరు ఎస్సీ, ఎస్టీ సెల్–1 విభాగంలో పనిచేస్తున్న విజయశేఖర్ నియమితులయ్యారు (ప్రస్తుతం తిరుపతి ట్రాఫిక్‌లో పనిచేస్తున్నారు). ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న కేవీ మహేష్ 2020 నవంబర్ 17 నుంచి రెండున్నర సంవత్సరాల పాటు విధులు నిర్వహించారు. బదిలీల్లో భాగంగా ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

➡ జిల్లాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన పత్తికొండ సబ్‌డివిజన్‌కు అనంతపురం దిశా మహిళా పీఎస్‌లో పనిచేస్తున్న ఎ.శ్రీనివాసులు, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌కు గుంటూరు ఈస్ట్‌లో పనిచేస్తున్న బి.సీతారామయ్య నియమితులయ్యారు.

➡ ఆత్మకూరు డీఎస్పీ వై.శృతిని శ్రీకాకుళంకు బదిలీ చేసి ఆ స్థానంలో బాపట్లలో ఉన్న ఎ.శ్రీనివాసరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

➡ కర్నూలు దిశ మహిళా పీఎస్‌లో పనిచేస్తున్న వెంకటరామయ్య ఆళ్లగడ్డకు బదిలీ కాగా, అక్కడున్న సుధాకర్‌రెడ్డి తిరుపతి స్పెషల్ బ్రాంచ్ విభాగానికి నియమితులయ్యారు.

హజ్ యాత్రలో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న హఫీజ్ మంజూర్ అహ్మద్

కర్నూలు(రాజ్‌విహార్): హజ్ యాత్రికులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు హఫీజ్ మంజూర్ అహ్మద్ అన్నారు. బుధవారం స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో హజ్ యాత్రికులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పవిత్ర మక్కా, మదీనా ప్రాంతాల్లో 40 రోజుల నిర్వహించే ఈ యాత్రలో ఎలా ఉండాలి, ఎక్కడ ఏ ప్రార్థనలు చేయాలి, ఎలా నడుచుకోవాలి, తవాఫ్ ఎలా చేయాలి, హేరాం దుస్తులు ఎలా ధరించాలి అనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రకు ఎంపికైన వారు రెండో విడత డబ్బు రూ.1,70,00 చెల్లించాలని, ఇప్పటి వరకు మొదటి విడత కింద రూ.81,800 చెల్లించని వారు రెండూ కలిపి ఈనెల 28వ తేదీలోపు చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ హజ్ సొసైటీ అధ్యక్షుడు మొహమ్మద్ పాషా, ఉపాధ్యక్షుడు అబ్దుల్ సలాం, ట్రైనర్ ముఫ్తీ అబ్దుర్ రహమాన్ పాల్గొన్నారు.

17 రోజుల శిశువుకు అరుదైన ఆపరేషన్



ఆపరేషన్ అనంతరం కోలుకుంటున్న శిశువు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరానికి చెందిన 17 రోజుల పసిబాలునికి స్థానిక సీఎస్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. చిన్నపిల్లల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ చలపతి బుధవారం వివరాలను వెల్లడించారు. నగరంలోని గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలో నివాసముంటున్న సిరాజ్, ముంతాజ్ దంపతులకు జన్మించిన ఈ శిశువు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ నెల 13వ తేదీన బాబును ఆసుపత్రిలో చేర్పించగా అన్ని పరీక్షలు నిర్వహించి వీపున గాకుండా ఎడమ కిడ్నీ పెల్విస్ వద్ద ఏర్పడి, అది కూడా తిరిగి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. మంగళవారం ఈ శిశువుకు అనెస్తెటిస్ట్ డాక్టర్ కొండారెడ్డి మత్తు మందు ఇచ్చారని, తాను ల్యాప్రోస్కోపిక్ ద్వారా కిడ్నీని సరిచేసే శస్త్రచికిత్స విజయవంతంగా చేసినట్లు డాక్టర్ చలపతి తెలిపారు. ఇలాంటి ఆరోగ్య సమస్య 10 లక్షల మందిలో ఒకరికి మాత్రమే వస్తుందని, హైదరాబాద్ లాంటి నగరాల్లో ఆపరేషన్‌కు రూ.5లక్షలు ఖర్చు అవుతుందని, ఈ ఆపరేషన్‌ను డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

హైస్కూళ్లకు నైట్‌వాచ్‌మెన్లు

కర్నూలు సిటీ: జిల్లాలోని 247 ఉన్నత పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్లను నియమిస్తున్నట్లు డీఈఓ డాక్టర్ వీ రంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రంలోపు ఈ పోస్టులను భర్తీ చేయాలని, లేదంటే ఎంఈఓలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి హైస్కూళ్ల దగ్గర నైట్ వాచ్‌మెన్లు విధులు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పేరెంట్ కమిటీ ద్వారా మాత్రమే ఈ పోస్టులను భర్తీ చేయాలని, ఇప్పటికే ఆయా స్కూళ్ల పని చేస్తున్న ఆయా/కుక్ కమ్ హెల్పర్‌ల భర్తలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామ/వార్డులోని మాజీ సైనికులు రెండో ప్రాధాన్యత ఇవ్వాలని, వీరెవరు అందుబాటులో లేకపోతే ఇతరులను నిమమించాలన్నారు. నైట్ వాచ్‌మెన్ స్థానిక నివాసి అయి ఉండాలని, వయస్సు 60 ఏళ్లలోపు ఉండాలని, ఎంపికైన వారికి నెలకు రూ.6 వేల చొప్పున టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్ నుంచి చెల్లించాలని సూచించారు. నియామకాలు పూర్తయిన వెంటనే ఐఎంఎంఎస్ యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు.

గోరుముద్దను పకడ్బందీగా అమలు చేయండి

సి.బెళగల్: జగనన్న గోరుముద్ద పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని మత్స్యశాఖ డీడీ, మండల ప్రత్యేక అధికారిణి శ్యామల ఆదేశించారు. సి.బెళగల్‌లోని మోడల్ స్కూల్‌ను మండల అధికారులతో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, మూత్రశాలలను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గోరుముద్ద పథకాన్ని తీసుకు వచ్చిందన్నారు. అనంతరం ఎంపీడీఓ రాముడు, ఎంఈఓ జ్యోతి, వైకేపీ ఏపీఎం వెంకటస్వామి తదితరులతో కలిసి ఆమె విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్యం

- డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య



చిన్నహోతూరు అంగన్‌వాడీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎం హెచ్ఓ రామగిడ్డయ్య

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో రోగులకు ఇంటి వద్దనే మెరుగైన వైద్యం లభిస్తోందని డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య అన్నారు. బుధవారం ఆయన చిన్నహోతూరు సచివాలయంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రామ్‌ను తనిఖీ చేశారు. రోగులకు ఎలాంటి వైద్య సేవలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి వృద్ధులకు, రోగులకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడే రోగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం పరిశీలించారు. రక్తహీనత ఉన్న పిల్లలకు సకాలంలో ఐరన్ ట్యాబ్లెట్లు అందించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత దుర్మరణం

- మరో ముగ్గురికి స్వల్ప గాయాలు



మృతి చెందిన పుష్పావతి

ప్యాపిలి: మండల పరిధిలోని ఏనుగుమర్రి వద్ద 44 వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందారు. వివరాల్లోకి వెళితే.. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం ఒంటిమిద్దె గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఒంటిమిద్దె గ్రామంలో దేవరకు విజయ్‌కుమార్ తన తల్లి, భార్య, ఇద్దరు పిల్లలతో కలసి కారులో వచ్చాడు. దేవర ముగిశాక కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. కాగా ఏనుగుమర్రి వద్దకు రాగానే రోడ్డుపై ఆగిఉన్న కంటైనర్‌ను కారు ఢీకొట్టింది. ప్రమాదంలో విజయ్‌కుమార్ భార్య పుష్పావతి (28) అక్కడికక్కడే మృతి చెందింది. విజయ్‌కుమార్‌తో పాటు అతని తల్లి గంగమ్మ, కుమారుడు శ్రీకాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డుపై నిర్లక్ష్యంగా కంటైనర్‌ను ఆపి ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి ఎస్ఐ సీఎం రాకేశ్ తెలిపారు.

రూ.30 లక్షలు విలువ చేసే చేపలు మృతి



చెరువులో మృతి చెందిన చేపలు

వెలుగోడు: పట్టణంలో నాగశివకు చెందిన చేపల చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు పురుగుమందు కలిపారు. దీంతో రూ.30 లక్షల విలువ చేసే చేపలు మృతి చెందాయి. తమ కుటుంబానికి చేపల చెరువే ఆధారమని, ఇప్పుడు అందులోని చేపలన్నీ చనిపోవడంతో దిక్కుతోచడం లేదని బాధితుడు నాగశివ కన్నీరు మున్నీరయ్యాడు. పురుగు మందు కలిపిన వ్యక్తులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు.

విద్యార్థి చేతిలోకి చొచ్చుకెళ్లిన ఇనుప చువ్వ



108లో కర్నూలుకు తరలిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు ఓ విద్యార్థి చేతికి ఇనుప చువ్వ గుచ్చుకుని లోపలికి వెళ్లింది. వివరాల్లోకి వెళితే.. బేతంచెర్ల పట్టణంలోని తహసీల్ పేట కాలనీకి చెందిన తిరుపతయ్య కొడుకు శివ దుర్గా ప్రసాద్ 7వ తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం తోటి మిత్రులతో కలిసి ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో ఆడుకొని తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో పాఠశాల గేటు ఎక్కి దిగుతుండగా గేటుకు ఉన్న కడ్డీ గుచ్చుకుని ఎడమ చేతిలోకి వెళ్లింది. వెంటనే తోటి విద్యార్థులు, సమీప కాలనీ వాసులు 108 కు సమాచారం ఇచ్చారు. చేతిలో గుచ్చుకున్న ఇనుప చువ్వను బయటకు తీసేందుకు ఎంత ప్రయత్నించినా రాలేదు. చివరకు వెల్డర్‌ను పిలిపించి ఇనుప చువ్వ కింది భాగం కట్ చేయించారు. చేతిలో ఇరుక్కుపోయిన ఇనుప చువ్వ రాకపోవడంతో విద్యార్థి దుర్గా ప్రసాద్‌కు 108 సిబ్బంది నాగార్జున, చంద్రశేఖర్ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

కలుషితాహారం తిని 40 మందికి అస్వస్థత



కరివేనలో బాధితులకు చికిత్స అందిస్తున్న దృశ్యం

ఆత్మకూరురూరల్: మండల పరిధిలోని కరివేన గ్రామంలో కలుషిత ఆహారం తిని 40 మందితీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి జరిగిన శుభకార్యంలో విందు ఏర్పాటు చేశారు. స్వీకరించిన వారిలో పలువురు మరుసటి రోజు తీవ్ర విరేచనాలు, వాంతులు, తలనొప్పికి గురయ్యారు. సమాచారం తెలుసుకున్న డీఎం అండ్ హెచ్ఓ వెంకటరమణ వెంటనే గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బైర్లూటీ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ పవన్, డాక్టర్ గోపాల్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ఆరోగ్య సర్వే నిర్వహించారు. అవసరమైన వారికి చికిత్స అందించారు. బుధవారం తహసీల్దార్ ప్రకాష్ బాబు వైద్య శిబిరాన్ని సందర్శించారు. బాధితులు కోలుకుంటున్నారని, ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. వైద్యశిబిరాన్ని హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మి పర్యవేక్షించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశెనగ	రూ. 3898	రూ. 6909
పొద్దుతిరుగుడు	రూ. 4489	రూ. 4509
ఆముదం	రూ. 3339	రూ. 5389
వాము	రూ. 4880	రూ. 26451
ఎండు మిర్చి	రూ. 4009	రూ. 35211
కందులు	రూ. 4200	రూ. 7910
మొక్కజొన్న	రూ. 1341	రూ. 1754
మినుములు	రూ. 7361	రూ. 7361